# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- ప్రభుత్వ స్థలంలో వెలసిన ఇండ్ల నేలమట్టం
- సర్కారు స్థలాలను కబ్జా చేస్తే పీడీయాక్ట్
- మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రసాద్‌గుప్తా హెచ్చరిక



గాజులరామారంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

మేడ్చల్, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ)/దుండిగల్: అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేస్తున్నారు. ఇటీవల కీసర, బోడుప్పల్, మేడిపల్లి, కాప్రా, కుత్బుల్లాపూర్ లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. శనివారం కుత్బుల్లాపూర్ గాజుల రామారంలో 350 అక్రమ నిర్మాణాలను కూల్చినట్లు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి వెల్లడించారు. కాగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఇక్కడ ఎన్నికల సమయంలో సుమారు 450పైగా నిర్మాణాలు వెలిసినట్లు గుర్తించిన అధికార యంత్రాంగం.. వాటిని తొలగించేందుకు భారీ కసరత్తే చేసింది. ఇందులో భాగంగా 270 మంది పోలీసు సిబ్బందితో పాటు 30 మంది వరకు రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణల కూల్చివేతల్లో పాల్గొన్నారు. సర్వేనంబర్ 307,329,342లలోని సగానికిపైగా నిర్మాణాలను నేలమట్టం చేశారు. సర్వేనంబర్ 342లో సుమారు 100 ఎకరాలు, 307లోని ఎస్‌ఎఫ్‌సీ భూములు సుమారు 70 ఎకరాలు, 329/1లోని చింతల్‌కుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లోని 10 ఎకరాలను ఆక్రమించిన వ్యక్తులు వాటిని 60 గజాల పాట్లుగా మలిచి ఒక్కొక్కటీ రూ.7 లక్షల నుంచి 10 లక్షల వరకు విక్రయించారు. అయితే కబ్జాదారులకు సార్వత్రిక ఎన్నికల సమయం కలిసొచ్చింది. సుమారు రెండు నెలలుగా అధికార యంత్రాంగం ఎన్నికల్లో విధుల్లో తలమునకలు కావడంతో ఇదే అదునుగా భావించి ఆక్రమణదారులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసే పనిలో పడ్డారు. రెండు నెలల కాలంలోనే సర్వే నంబర్ 307,329, 329/1,342లల్లో 450పైగా ఇండ్లు వెలిశాయి. ఇదిలా ఉంటే గాజులరామారం పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ఆర్డీవో శ్యామ్‌ప్రసాద్ గుప్తా నేతృత్వంలో కొనసాగింది. అక్రమ నిర్మాణాల కూల్చివేతల ప్రక్రియలో మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రసాద్‌గుప్తా, కుత్బుల్లాపూర్ తహసీల్దార్ రహమాన్‌ఖాన్‌తో పాటు బాచుపల్లి, గండిమైసమ్మ-దుండిగల్, కూకట్‌పల్లి, బాలానగర్ మండలాలకు చెందిన సుమారు 30 మంది రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.తెల్లవారు జాము నుంచే పోలీసుల బలగాలతో కూల్చివేతలు మొదలుకావడంతో పేదప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లల భవిష్యత్ కోసం, ఆడబిడ్డల పెండ్లిళ్ల కోసం ఇంటి స్థలాలను కొనుగోలు చేశామని, వాటిని కూల్చివేయవద్దని అధికారులను బతిమిలాడుకున్నారు. అయినా బలవంతంగా ఇండ్లల్లోని సామన్లను ఖాళీ చేయించిన అధికారులు సాయంత్రం వరకు కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రసాద్ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్న వారిపై పీడీయాక్ట్ నమోదు చేయిస్తామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

## కొనసాగుతున్న ఆటో డ్రైవర్ల నిరసనలు

కంటోన్మెంట్/కందుకూరు, డిసెంబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తున్నదని నగర ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో ఆటో సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శ్రీశైలం జాతీయ రహదారిపై తెలంగాణ ఆటోస్ ప్యాసింజర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటోలతో శనివారం నిరసన ర్యాలీని నిర్వహించి రాస్తారోకో చేశారు. అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎడ్ల ఉదయ్ ముదిరాజ్, మహేందర్ మాట్లాడుతూ... ఆటో డ్రైవర్ల కుటుంబాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రోజుకు రూ. 500 ఆదాయం వచ్చేదని, ఇప్పుడు రూ. 100 కూడా రావడం లేదని వాపోయారు. కుటుంబ పోషణ, ఆటో ఫైనాన్స్ ఎలా తీర్చాలో తెలియడం లేదన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రాజు, మహేందర్, అశోక్, వెంకటేశ్, పాండు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యూ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న దర్గా హజ్రత్ సయ్యద్ మిస్కీన్ షా ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో శనివారం ఆటోడ్రైవర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. తాము డిగ్రీలు చదువుకున్నా.. ఉద్యోగాలు దొరక్క ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నామని దర్గా హజ్రత్ సయ్యద్ మిస్కీన్ షా ఆటో స్టాండ్ అధ్యక్షుడు అలీం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటించడం ద్వారా మహిళలు సంతోషంగా ఉన్నా.. ఆటో డ్రైవర్ల కుటుంబాల మహిళలు ఏ మాత్రం సంతోషంగా లేరన్నారు. ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని, ప్రతినెల జీవన భృతి 10వేలు, ప్రతి ఆటో డ్రైవర్‌కు జీవిత బీమా 5 లక్షలు పాలసీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే చర్యలు తీసుకోకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. సర్కారు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## సిటీ కాలేజీ విద్యార్థికి జాతీయ అవార్డు



రవికి జాతీయ అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్

చార్మినార్, డిసెంబర్ 16: ప్రభుత్వ సిటీ కాలేజీలో చదువుతున్న చిక్కొండ్ర రవి రెండు జాతీయ కవితా పురస్కారాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ తెలిపారు. పోపూరి వెంకట సుబ్బారావు ధర్మనిధి సందర్భంగా తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం తెలుగు శాఖ నిర్వహించిన జాతీయ స్థాయి కవితా పోటీల్లో రవి పాల్గొన్నారన్నారు. రవి రూపొందించిన కవితా సంకలనానికి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి లభించిందన్నారు. శనివారం సిటీ కాలేజీలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో డాక్టర్ బాలభాస్కర్ ప్రశంసా పత్రం, బహుమతులు, నిర్వాహకులు అందించిన రెండు వేల నగదును సిటీ కాలేజీ తరపున రవికి అందించారు.

## ధ్యానం దివ్య ఔషధం



యువశక్తి సమ్మేళనంలో పాల్గొన్న సహజ యోగా సాధకులు

పీర్జాదిగూడ, డిసెంబర్ 16: చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలను దుర్భరం చేసుకుంటున్న యువతకు ధ్యానం దివ్య ఔషధంగా పని చేస్తుందని రాష్ట్ర సమన్వయకర్త కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పీర్జాదిగూడలోని పళనీ గార్డెన్‌లో మేడిపల్లి శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజ యోగ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సహజ యోగా యువశక్తి సమ్మేళనం రెండోరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి సుమారు 40 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.



జేఎన్‌టీయూలో జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న వీసీ కట్టా నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రెడ్డి, యూఐసీసీఐ డైరెక్టర్ తారాకల్యాణి తదితరులు

## అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి.. జాబ్‌మేళాకు మంచి స్పందన**

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 16: నిరుద్యోగులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జాబ్‌మేళా వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలను జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం జేఎన్‌టీయూ నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ, సేవా ఇంటర్‌నెట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను వీసీ కట్టా నర్సింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువులు పూర్తయిన నిరుద్యోగులు నిత్యం కొత్త అంశాలను నేర్చుకోవాలని.. ఇంటర్వ్యూల్లో పాల్గొన్నప్పుడే లోపాలు తెలుస్తాయన్నారు. వర్సిటీలో జాబ్‌మేళాలు నిర్వహిస్తూ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలతో పాటు పలు ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు 65వేల మంది జాబ్‌మేళాలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో మహేంద్ర కాగ్నిట్ లాంటి ఐటీ కంపెనీలు రెడ్డీస్, అరబిందో, హెటిరో లాంటి ఫార్మా కంపెనీలు, ఐసీఐసీఐ, యాక్సెస్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్ లాంటి వంద సంస్థలు హాజరుకాగా సుమారు 10వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా ఇంటర్‌నెట్ సంస్థ వ్యవస్థాపకురాలు సుభద్రా రాణి, యూఐఐసీ డైరెక్టర్ తారాకల్యాణి, డిప్యూటీ డైరెక్టర్ సురేశ్‌కుమార్, పీఆర్వో ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు



సోమాజిగూడలో జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్

## జంక్షన్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో/బంజారాహిల్స్, డిసెంబర్ 16: నగరంలోని పలు కూడళ్లలో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. శనివారం కేబీఆర్ పార్కు వాక్‌వేలో ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్ రోనాల్డ్ రాస్ అక్కడ మురుగు సమస్యలను గుర్తించారు. వాక్‌వేలో అపరిశుభ్రత కనిపిస్తోందని, మురుగు సమస్యలు పరిష్కరించడంతో పాటు వాకర్లకు ఆహ్లాదాన్ని పంచేలా చూడాలని ఆదేశించారు. దీంతో పాటు వాకర్లకు అవసరమైన సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం సోమాజిగూడ, నాగార్జున సర్కిల్, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో పట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. జంక్షన్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన అన్ని జంక్షన్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేశ్ దోత్రే, యూబీడీ అదనపు కమిషన్ కృష్ణ, ఎస్ఈ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.